క్లుప్తంగా

రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్‌తోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని సీఐ సుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని ఆటో డ్రైవర్లకు సోమవారం ట్రాఫిక్ రూల్స్‌పై సీఐ అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ఆటో యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఆలయ అర్చకులు ఉద్దండ నవీన్ రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ దాత నల్ల సంధ్య, మనోహర్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, వెంకటరమణ, శ్రీనివాస్, బెజ్జంకి రమేశ్, దేవసాని శంకరయ్య, నోముల గోపాల్‌రెడ్డి, భజన భక్తులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలపై ప్రజలు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని పాలకుర్తి మండల తహసీల్దార్ సునీత సూచించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో కూడా తాను పాలకుర్తి తహసీల్దార్‌గా పని చేశానని, స్థానిక సమస్యలపై అవగాహన ఉందన్నారు. భూభారతి చట్టంతో ఎన్నో పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల ప్రతినిధులు ఆమెను సత్కరించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నరేందర్, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, ఆర్ఐ సంతోష్‌రావు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కమాన్‌పూర్: అనారోగ్యంతో బాధపడుతున్న మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు చెందిన ముక్కెర వైష్ణవికి రూ.5వేలతో పాటు 25కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, అలాగే ఎండీ ఫర్వీన్ వివాహానికి సుందరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ బోనాల వెంకటస్వామి రూ.5వేలు సోమవారం అందజేశారు. పిల్లిపల్లెకు చెందిన పిడుగు రాములు కొన్నిరోజుల క్రితం మృతి చెందగా రాములు కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేశారు. సభ్యులు కన్నూరి నగేష్, చిప్పకుర్తి అరవింద్, దండె తిరుపతి, చెన్నోజు చంద్రశేఖర్, కామ సంతోష్, కుక్క ప్రసాద్, గెల్లు లింగయ్య, కురిమిళ్ల ప్రశాంత్, ఆడెపు రాజేశ్, శ్యాం ఉన్నారు.

రైతుల సంక్షేమమంటే గిదేనా?


మాట్లాడుతున్న కందుల శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడమే రైతు సంక్షేమమా అని బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ ప్రశ్నించారు. పెద్దపల్లిలోని సురేశ్‌రెడ్డి నివాసంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం తడిసిముద్దయిందంటూ వీడియో, ఫొటోలు చూపించారు. ఆ గ్రామ నాయకులు తమ ప్రజాప్రతినిధి మెప్పు పొందేందుకు, ప్రశ్నించిన తమపై విమర్శలకు దిగారే తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేయించడంలో చూపలేదన్నారు. అనవసర విమర్శలు మాని రైతులకు మేలు కలిగేలా చూడాలన్నారు. రైసుమిల్లర్లతో సంబంధిత అధికారులు, నాయకులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు రామస్వామి, కుమార్, అంజి, వేణు, రజనీకర్‌రెడ్డి, అనిల్, సాయికిరణ్, అరవింద్ ఉన్నారు.

ఆటంకం లేకుండా వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని: ఆస్పత్రి వైద్యులు సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆటంకం లేకుండా వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

ఎలిగేడు: జిల్లాలో పైలట్ మండలంగా ఎంపికైన ఎలిగేడులో జూన్ 2 నాటికి భూసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఎలిగేడు తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి నూతన ఆర్ఓఆర్ చట్టం, భూభారతి ప్రకారం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ఎలిగేడు తహసీల్దార్ యాకన్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- రాయితీ అందిస్తున్న ప్రభుత్వం


ఉద్యానవనం ఏర్పాటు చేయడానికి పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

సుల్తానాబాద్: ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా 2025–26 సంవత్సరానికి ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో మామిడి, జామ, కొబ్బరి, బ్లాక్ బీర్, ఆయిల్ పామ్, మునగ, తీయటి ఆరెంజ్, డ్రాగన్, నిమ్మ, సపోటా సాగు చేసేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా ముందుకు వెళ్తున్నామని డీఆర్డీవో కాళిందిని తెలిపారు. ఉద్యాన పంటలతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు ఆర్జించవచ్చన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీలు అందిస్తోంది.

బిందు సేద్యంతో పంటలు

బిందు సేద్యం (డ్రిప్) పరికరాలకు సేద్యం చేసే అవకాశం ఉండడంతో సన్న, చిన్న కారు రైతులే కాకుండా మధ్యతరగతి రైతులు సైతం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. డ్రిప్ కావాలని రైతులు మాత్రం సమీపంలోని మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. కూరగాయల సాగు పెంచేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా శాశ్వత నిర్మాణం కోసం రూ.50లక్షలు యూనిట్‌గా ప్రభుత్వం కేటాయించనుంది.

ఆయిల్‌పాం సాగు..

దొంగల బెడద లేని ఏకైక పంట ఇది. జిల్లాలో ఈ ఏడాది 2500 ఎకరాల్లో చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయిల్ కంపెనీ లైన్ తెలంగాణ ఆయిల్ ఫెడ్ కంపెనీ మొక్కలు అందిస్తుంది. వీటికి రూ.11,650 రాయితీతో పాటు నిర్వహణ రాయితీ, అంతర పంటలకు ఎకరానికి రూ.4,200 చొప్పున సబ్సిడీ అందిస్తుంది

జిల్లాలో ఉద్యాన పంటలు

జిల్లాలో 350 ఎకరాల్లో ఉద్యానపంటలు సాగు చేసేలా ఈజీఎస్ లక్ష్యం ఏర్పాటు చేసుకుంది. ఈ ఏడాది 350ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు అంగీకరించడంతో ఈజీఎస్ ద్వారా వారికి పలు రకాల మొక్కలు అందించే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

పిస్టల్ షూటర్‌కు అభినందనలు


అభినందిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

గోదావరిఖని: అంతర్జాతీయ పిస్టల్ షూటింగ్ పోటీల్లో రాణించిన పోలీస్ అధికారి కుమార్తె మేఘనను రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా అభినందించారు. సీపీ కార్యాలయంలోని తన చాంబర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో మేఘనను అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

బదిలీల నూతన సర్క్యులర్ రద్దు చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికులకు నష్టం కలిగించేలా తెచ్చిన బదిలీల నూతన సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) ఐఎఫ్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ కోరారు. కాలనీ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌కు నాలుగేళ్లు పెట్టిన నిబంధనలు తొలగించాలని, పాత పద్ధతిలోనే బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బి.అశోక్, నరేశ్, లింగన్న, చంద్రన్న, పోచయ్య, బాబు, సంజీవ్, వినోద్, నాగరాజ్, ప్రకాశ్ ఉన్నారు.

పుష్కరాల ముగింపు వేడుకల్లో రామగుండం ఎమ్మెల్యే



గోదావరిఖని: సరస్వతి పుష్కరాల ముగింపు వేడుకల్లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సోమవారం పాల్గొన్నారు. హారతి ఉత్సవంలో పాల్గొని, శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు బొంతల రాజేశ్, ముస్తాఫా, గాజుల కిరణ్ ఉన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లికి జలాభిషేకం


బిందెల్లో నీళ్లు తీసుకెళ్తున్న గౌడ కులస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేటలో ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఎల్లమ్మతల్లికి జలాభిషేకం చేసేందుకు మానేరు నది నుంచి గౌడ కులస్తులు బిందెల్లో నీటిని తీసుకుని ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మతల్లికి జలాభిషేకం చేశారు.

బహుజన వర్గాల వ్యతిరేక పార్టీ కాంగ్రెస్సే


మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: బహుజన వర్గాలకు కాంగ్రెస్ వ్యతిరేకమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాంకిడి నుంచి అలంపూర్ వరకు చేపట్టిన బీసీ మేలుకొలుపు యాత్ర సోమవారం రాత్రి మంథనికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశంలో 56శాతం ఉన్న బీసీ వర్గాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ ఆజాది ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ అన్నారు. నాయకులు శంకర్‌లాల్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణ సమితి ఏర్పాటు చేస్తాం

గోదావరిఖని: సింగరేణి సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకోవడం, మారుపేర్లు, విజిలెన్స్ పేరుతో పెండింగ్ ఉద్యోగాల పరిష్కారం కోసం సింగరేణి పరిరక్షణ సమితి ఏర్పాటు చేయనున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గంట సత్యనారాయణరెడ్డి, గుమ్మడి కుమారస్వామి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి ప్రాంతంలో 10వేల ఉద్యోగాలు రావాలని, కొత్త బావులు రావడానికి సింగరేణి పరిరక్షణ సమితి పోరాటం చేస్తుందన్నారు. మారుపేర్ల విజిలెన్స్ సమస్యతో ఉద్యోగాలకు దూరమైన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించేదాకా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు వంగ లక్ష్మీపతిగౌడ్, పులి మధు, నరేశ్, వెంకటేశ్ ఉన్నారు.

ఎలిగేడులో బడిబాట

ఎలిగేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం దేవేందర్‌రావు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యా బోధనపై అవగాహన కల్పించారు. సత్యనారాయణ, ప్రేమలత, గంగారెడ్డి, శ్రీనివాస్, ఉమారాణి, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం హేయమైన చర్య

జూలపల్లి: కాంగ్రెస్ మొదటి నుంచి దళిత వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని, దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజాప్రతినిధులను అవమానించడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరగాని ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ నాయకులు పెద్దోళ్ల ఐలయ్య, మేరుగు కనుకయ్య, కొమ్మ ఐలయ్య, గుమ్మడి శంకరయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. దళిత ప్రజాప్రతినిధులను తక్కువ చేసి చూడడం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలన్నారు.

విశ్వేశ్వరాలయంలో మాస శివరాత్రి వేడుకలు

రామగుండం: అబాది రామగుండంలోని శ్రీకాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం రాత్రి మాస శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. కొంపల సాయికుమార్, సౌజన్య, మంత్రి పద్మ అన్నదాతలుగా వ్యవహరించారు.

సంక్షిప్త వార్తలు

• మూడు కార్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్దబొంకూర్ గ్రామాల శివారులో సోమవారం ఒకదాని వెంట మరొకటి ఇలా మూడుకార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి స్వల్పగాయాలైనట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పుష్కరాలకు వెళ్లి వస్తున్న ఆనంద్ కారును వెనక నుంచి అజీజ్ తన కారుతో ఢీకొన్నాడు. వీటికి కొద్ది దూరంలో రోడ్డుపక్కన నిలిపి ఉంచిన హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్‌రావుకు చెందిన కారును ఆనంద్ కారు ఢీకొట్టి బోల్తాపడింది. ఆనంద్ కారులో ప్రయాణిస్తున్న కుటుంబీకులు విజయ, మురళి, హర్షితకు స్వల్పగాయాలు కాగా 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

• రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ ఏఎల్‌పీ ప్రధాన మార్గంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ.ప్రశాంత్ అనే సింగరేణి గని కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గోదావరిఖని బస్టాండ్ కాలనీకి చెందిన ప్రశాంత్ అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టులో(ఏఎల్‌పీ)గనిలో విధులు నిర్వహిస్తున్నాడు. నైట్ షిఫ్ట్ విధులు ముగించుకొని తన బైక్‌పై గోదావరిఖని వైపు వెళ్తుండగా వకీల్‌పల్లి గని ఇసుక బంకర్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని ఎడమకాలు విరిగి ఒక ముక్క రోడ్డుపై పడిపోయింది. అటువైపు నుంచి వస్తున్న తోటి కార్మికులు గమనించి వెంటనే అంబులెన్స్‌లో కాలనీ సెక్టార్–3 డిస్పెన్సరీకి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

• ఆధునీకరణ పనుల్లో నాణ్యత పాటించాలి

రామగుండం: అమృత్ భారత్ పథకంలో భాగంగా రామగుండం రైల్వేస్టేషన్‌ను కోట్లాది రూపాయలతో చేపడుతున్న ఆధునీకరణ పనుల్లో నాణ్యత పాటించాలని రైల్వే ప్రజాసంబంధాల మాజీ ప్రతినిధి క్యాతం వెంకటరమణ సోమవారం రైల్వే ఏడీఈఎన్ గుప్తా, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ విశ్వేశ్వరరావుతో సమావేశమయ్యారు. రైల్వేస్టేషన్‌పై ఏర్పాటు చేసిన నేమ్ ప్లేట్ కుప్పకూలిందని, ప్రవేశ ద్వారం ఎదుట వర్షపు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీనిపై అధికారులు స్పందిస్తూ మ్యాన్‌వల్ పనులతో జాప్యం జరుగుతోందని, జూన్‌లోగా డ్రైనేజీ, ఇతరత్రా పనులు పూర్తవుతాయని తెలిపారు. మాజీ సభ్యుడితో పాటు కొమ్మల స్వామి ఉన్నారు.

• బోర్డులు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

మంథని: మంథని రెవెన్యూ శివారులోని రెడ్డిచెరువు ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కాకర్లపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ మాట్లాడారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ధ్వంసం చేసిన వారిపై దుండగలపై చర్యలు తీసుకోవాలన్నారు. కాకర్లపల్లి శ్మశాన వాటిక పక్కన కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ పద్మ కొమురయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, రామచందర్, రవీందర్, అశోక్, గట్టయ్య, రాజశేఖర్, రాజమ్మ, లక్ష్మి, మౌనిక, నిర్మల, ప్రేమ, నరసమ్మ పాల్గొన్నారు.

• చేతిపంపు బోర్‌కు మరమ్మతు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం ముస్త్యాలలోని చేతి పంపు బోర్ పనిచేయకపోవడంతో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ లావణ్యకు తెలిపారు. వెంటనే స్పందించిన ఆమె బోర్‌కు మరమ్మతు చేయించారు.

• ఆత్మరక్షణకు కరాటే

జూలపల్లి: కరాటే శిక్షణ ఆత్మరక్షణతో పాటు, ఆరోగ్యానికి ఉపయోగ పడుతుందని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ అన్నారు. మండలంలోని తేలుకుంట జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో కలెక్టర్, జిల్లా యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో కరాటే శిక్షణను పీఈటి దాసరి రమేశ్‌తో కలిసి సందర్శించారు.

• తహసీల్దార్, ట్రాఫిక్ పోలీసుల మధ్య వాగ్వాదం

కరీంనగర్‌క్రైం: పెద్దపల్లి జిల్లాకు చెందిన ఓ తహసీల్దార్‌కు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులకు సోమవారం కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ సమీపంలో వాగ్వాదం నెలకొంది. రాంగ్ రూట్లో వస్తున్న వాహనానికి జరిమానా విధించే విషయంలో తహసీల్దార్, పోలీసులకు పరస్పరం అరగంట పాటు గొడవ జరగడంతో ఆ ప్రాంతంలో చర్చనీయాంశమైంది.

వైభవంగా శివకల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో భక్తులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలోని శ్రీనాగలింగేశ్వర స్వామి దేవాలయం రెండో వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శివకల్యాణోత్సవం, రుద్రభిషేకం అర్చకులు రత్నాకర్‌శర్మ వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు. దన్నాయక్ అమల, దామోదర్‌రావు, పాల్గొన్నారు.




రామగుండం: కుందనపల్లి అనుబంధ గ్రామమైన మొగల్‌పహాడ్ గ్రామ శివారులో నాలుగేళ్ల క్రితం స్వచ్ఛ భారత్ నిధులతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. ప్రతీ ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణంపై అధికారులు తమ లక్ష్యాన్ని పూర్తి చేయడంతో సామూహిక మరుగుదొడ్డి వినియోగం లేకుండా పోయింది. ఫలితంగా ప్రాంగణం పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయి అపరిశుభ్రంగా మారింది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

కథలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయి


కేఆర్‌పీ రెడ్డికి బాలల కథల పుస్తకం అందిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్‌రావు

కాల్వశ్రీరాంపూర్: కథలు, గేయాలు, పాటలు చిన్నారుల మానసిక వికాసానికి దోహదం చేస్తాయని 'సాక్షి' డైరెక్టర్ (అడ్వర్టైజింగ్ అండ్ మార్కెటింగ్) కేఆర్‌పీ రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ జగదీశ్వర్‌రావు రచించిన 'బాలల కథలు' ఇంగ్లీషు, తెలుగు వర్షన్ పుస్తకాన్ని ఆయన కేఆర్‌పీ రెడ్డికి అందించారు. అనంతరం కేఆర్‌పీ రెడ్డి మాట్లాడుతూ తహసీల్దార్ రచించిన బాలల కథలు పుస్తకం పిల్లల్లో జిజ్ఞాస పెంచుతుందన్నారు. కథల ద్వారా చిన్నారుల్లో ప్రేమ, ఆప్యాయతలు, బంధుత్వాలు, నైతిక భావనలు, సత్ప్రవర్తన అలవడతాయన్నారు. అంతకుముందు కేఆర్‌పీ రెడ్డి సింగిల్‌విండో కార్యాలయంలో తమ తండ్రి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత స్వర్గీయ కాల్వ రాంచంద్రారెడ్డి విగ్రహానికి తన సోదరులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీటీ శంకర్, కేఆర్‌పీ రెడ్డి సోదరులు వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సీఈవో కోలేటి శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రానవేన శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచు అల్లంల దేవేందర్, ఆర్ఐలు, కంప్యూటర్ ఆపరేటర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు వేతన బకాయిలు ఇప్పించాలి


వినతిపత్రం ఇస్తున్న సీఎంఓఏఐ నాయకులు

గోదావరిఖని: సింగరేణి అధికారుల వేతన బకాయిలు ఇప్పించాలని కోరుతూ సోమవారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌కు సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, పొనుగోటి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ (పీఆర్‌పీ) 2022–23 బకాయిలు చెల్లించేలా చూడాలని కోరారు. అధికారులు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్ చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: కార్మికులను బెదిరించి ఉత్పత్తి సాధించలేరని ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లాగౌడ్ స్పష్టం అన్నారు. జీడీకే–1వ గనిమేనేజర్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అండర్ గ్రౌండ్ ఉద్యోగులను ఉపరితల పనులకు వినియోగించుకుంటున్న యాజమాన్యం, వారికి అండర్ గ్రౌండ్ అలవెన్స్ చెల్లించడం లేదని ఆరోపించారు. సర్ఫేస్ ఐరన్ బొగ్గు బంకర్ నిర్మాణం, ప్యాచ్ వెల్డింగ్ ఉపరితల పనులను ఏరియా వర్క్‌షాప్ ఉద్యోగులతో చేయాల్సి ఉండగా, అండర్‌గ్రౌండ్ కార్మికులతో చేయిస్తున్నారన్నారు. ఉత్పత్తి విషయంలో అధికారులు కార్మికులను బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నాయకులు మానాల శ్రీనివాస్, కలవేణి రాజేశ్, నందిని నరేశ్, ఏగోళపు శంకరయ్య, నగేష్, కొప్పుల లింగయ్య ఉన్నారు.

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు కాపాడుకో


హెల్మెట్ అందిస్తున్న ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్

పెద్దపల్లిరూరల్: బైక్ నడిపేవాళ్లు రోడ్డుభద్రత నియమాలు పాటిస్తూ, హెల్మెట్ పెట్టుకుని ప్రాణాలు కాపాడుకోవాలని ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్ కోరారు. పెద్దపల్లి డీసీపీ కార్యాలయ సమీపంలో సోమవారం శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించిన వాహనదారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎండీ శేఖర్, శ్రీనివాసరెడ్డి, సతీశ్, సురేశ్, వెంకటరాజం, శ్రీనివాస్, మహేందర్, భూమయ్య, శివప్రసాద్, జాన్, ప్రసాద్, రాజిరెడ్డి, జబ్బార్‌ఖాన్, గంగాధర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండండి

యైటింక్లయిన్‌కాలనీ: సైబర్ నేరాలతో ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ ఎస్సై తిరుపతిరెడ్డి అన్నారు. ఆర్జీ–2 ఏరియా గనుల వృత్తి శిక్షణ కేంద్రంలో యువ సింగరేణి కార్మికులకు సైబర్ నేరాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో రుణాల జోలికి వెళ్లొద్దని, వాట్సాప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ యాకుబ్, రవికుమార్, అఫ్రోజ్, మల్లేశ్, ఎంవీటీసీ శిక్షకులు కిషోర్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ధర్మారం: ఫర్టిలైజర్ దుకాణాలలో కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి భాస్కర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న విత్తనాల స్టాకులను ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.